# తూర్పు పడమరలు

పూడిపెద్ది శేషుశర్మ

"హల్లో సంధ్యా, వెన్ డిడ్ యు కమ్" స్కూటరెక్కుతూ, గేటు తలుపుతీసుకొని ప్రక్కింటిలో నుండి బయటకు వస్తున్న సంధ్యను చూసి అడిగేడు కిరణ్.

"టూ డేస్ బేక్" సమాధానమిచ్చింది సంధ్య.

"ఈ ఏడాది ఎండలు విపరీతంగా ఉన్నాయి. మేమే భరించలేకపోతున్నాం, అమెరికా అమ్మాయి, మీరేం భరిస్తారు? యు షుడ్ హేవ్ కమ్ ఇన్ వింటర్" అన్నాడు కిరణ్ సంధ్య దగ్గరకొస్తూ.

"వెల్ అయామ్ సార్ట్ ఆఫ్ యూజ్డ్ టు ఇట్" చేతిలో ఉన్న పుస్తకంతో విసురుకుంటూ అంది సంధ్య.

"ఎక్కడికి బయలుదేరారేమిటి ఇంత ఉదయాన్నే, ఇంకా ఏడున్నర కాలేదు?" అడిగాడు కిరణ్.

"నాట్యకళా నికేతన్‌కి. అక్కడ ఎనిమిది కల్లా ఉండాలి. ఉదయాన్నే వెడితే అంత ఎండగా ఉండదు. సూర్యుడు నడినెత్తి నెక్కే సరికి ఇంటికి చేరవచ్చు. అయినా నా కిది అలవాటేగా. క్రిందటేడాది మీరు నాకోసారి లిఫ్ట్ ఇచ్చారు గుర్తుందా?" అంది సంధ్య ఇంగ్లీషులో.

"అదే బంజారా హిల్స్‌లో ఉండేదేగా, ఎలా వెళ్తారూ"

"ఆటో అలవాటేగా"

"నేనూ అటు ప్రక్కగానే పోవాలి. ఇఫ్ యూ డోంట్ మైండ్, ఐ కెన్ గివ్ యూ ఎ లిఫ్ట్." అన్నాడు కిరణ్ ఏమీ సంకోచించకుండా.

"ఐ డోంట్ వాంట్ టు ట్రబుల్ యూ" సందేహిస్తూ అంది సంధ్య.

"గొప్పవారే! ఇందులో ట్రబులేముంది. మీకోసం ప్రత్యేకంగా అటుపోవటం లేదు కదా, రండి", అంటూ సంధ్యను కూర్చోమన్నాడు. వెంటనే స్కూటరు బయలుదేరింది.

సంధ్య హైదరాబాదులో పుట్టినా ఐదేళ్ల ప్రాయంలో తల్లి దండ్రులతో బాటు, న్యూయార్కులో సెటిలయిపోయింది. ఇరవై రెండు సంవత్సరాలు తనకి. కాలేజ పూర్తి చేసి, కొలంబియా యూనివర్సిటీలో ఎం.బి.యే. చేస్తోంది. సంధ్యకి భరతనాట్యం, కూచిపూడి అంటే ఆరో ప్రాణం. ఎలాగైనా వాటిలో ప్రావీణ్యం సంపాదించాలని, గత మూడు సంవత్సరాలుగా వేసవి సెలవల్లో, హైదరాబాదులో వాళ్ల మేనమామగారి ఇంట్లో ఉండి, నాట్యం నేర్చుకుంటోంది. చామన ఛాయ, పెద్దపొడగరి కాకపోయినా, కోటేరిన ముక్కు, చిన్ననోరు, దట్టమైన ఉంగరాల జుత్తుతో ఆకర్షణీయంగా ఉంటుంది సంధ్య. సంధ్య మేనమామ ప్రసాదరావుగారి ప్రక్కింటి అబ్బాయి కిరణ్. బి. టెక్ పాసయి, ఏదో కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. అమెరికాలో మాస్టర్స్ చేద్దామని ఏవో యూనివర్సిటీలకి అప్లయిచేశాడు. వస్తే వెడదామని ఎదురు చూస్తున్నాడు కిరణ్. మార్నాడుదయం సంధ్య గేటు తీసుకు రాగానే, స్కూటర్‌తో ఎదురయ్యాడు కిరణ్, "సంధ్యగారూ, లిఫ్ట్‌కావాలా? " అంటూ.

"మీకు కష్టమవక పోతే, తప్పకుండా. బైదివే నన్ను "గారూ" అనక్కరలేదు, సంధ్యా అనండి చాలు" ఇంగ్లీషులోనే సమాదానం చెప్పింది సంధ్య. అలా రోజూ సంధ్య బయలుదేరే సమయానికి స్కూటరేసుకొని రావడం, సంధ్యని డాన్స్ స్కూల్ దగ్గర బెట్టడం పరిపాటయి పోయింది కిరణ్‌కి.

"కిరణ్, నాకు రైడ్ ఇవ్వడం మీకొక పెద్ద ఇంపొజిషన్ కాదు కదా!" అంది సంధ్య కిరణ్‌తో.

"భలే వారే, నేనేమీ మొహమాటస్థుడిని కాదు సుమండీ, నాకు కుదరదనిపిస్తే , నేను మిమ్మల్ని ముందే అడిగి ఉండే వాడిని కాదు" అన్నాడు కిరణ్.

"కిరణ్, నన్ను నువ్వు అను ఫరవాలేదు. నేనూ అలాగే అంటా. ఇంకోటి, నువ్వేమీ అనుక్కోకపోతే. నీ స్కూటర్ గ్యాస్, అదే పెట్రోల్ ఖర్చు నేనిచ్చేస్తా. మరి రోజూ నాకు ఆటో ఖర్చు తప్పుతోంది కదా".

"గొప్పదానివే సంధ్యా, నేను రోజూ అటే వెళ్లాలిగా. నాకు ఖర్చు ఎలాగా తప్పదు నువ్వొచ్చినా, రాకపోయినా. అయినా నీతో మాట్లాడుతూంటే, నేను ముఖ్యంగా అమెరికా గురించి, ఎన్ని క్రొత్త విషయాలు నేర్చుకుంటున్నానో. ఇట్ హేజ్ బీన్ ఏన్ ఎడ్యుకేషనల్ ఎక్స్పీరియన్స్ ఫర్ మి. అంతే కాదు. ఐ ఎంజాయ్ టాకింగ్ టు యూ" అన్నాడు కిరణ్.

"థాంక్స్. సేమ్ హియర్. యు హేవ్ బీన్ ఏ గుడ్ ఫ్రెండ్ టు మి" అంది సంధ్య చిన్నగా నవ్వుతూ.

సంధ్య ఇండియా వచ్చి రెండు వారాలయింది. ఒక రోజు మధ్యాహ్నం భోజనం చేస్తూండగా, సంధ్యని అడిగింది వనజ. వనజ ప్రసాదరావుగారి కూతురు. "సంధ్యా, నీకు రోజూ కిరణ్ లిఫ్ట్ ఇస్తున్నాడట కదా" అని

"అవును, ఏం?"

"మరేం లేదు. నీకు అన్‌కంఫర్టబుల్‌గా ఏమీ అనిపించడం లేదా?" అంది వనజ.

"లేదే! నేను హైస్కూల్లో ఉన్నప్పుడు మాప్రక్కింటి అబ్బాయి మైకల్‌తో స్కూలుకి పోతూండే దానిని. అందులో తప్పేముంది?" అని సమాధానమిచ్చింది సంధ్య.

"ఏం లేదు. ఊరికే అన్నా. అమ్మకి, నాన్నగారికి, అది అంత పెద్దగా నచ్చినట్లుగా లేదు. కాని నాతో వాళ్లేమీ అనలేదు. నువ్వేం బాధ పడకు." అంది వనజ.

"వెల్, ఏమైనా ప్రోబ్లమ్ ఉంటే చెప్పు. దాని దేముంది. హాయిగా ఆటోలో పోతా. కానీ నిజానికి కిరణ్ చాలా జంటిల్ మన్. అతని మీద నాకే అనుమానాలూ లేవు. ఇన్ ఫేక్ట్ ఐ లైక్ హిమ్ ఎ లాట్." అంది సంధ్య ధీమాగా.

"అయినా నువ్వు అమెరికాలో పెరగిన అమ్మాయివి. నీకు మాలాగ ఇన్హిబిషన్స్ అవీ ఉండక పోవడంలో ఆశ్చర్యం ఏముంది?" అంది వనజ.

ఆరువారాలు దొర్లిపోయాయి. కిరణ్ అంటే మంచి స్నేహభావం ఏర్పడింది సంధ్యకు. రోజూ అతనితో డాన్స్ స్కూల్‌కి పోతూ ఉండేది. వీలయినప్పుడల్లా వారిద్దరూ చిరకాల స్నేహితుల్లా మనస్సు విప్పుకొని మాట్లాడుకునేవారు.

ఒకరోజ సంధ్య యింటికి రాగానే, ఏదో మాట్లాడుతున్న వాళ్లల్లా తనని చూసి ఆగిపోయారు వనజ, వనజ తల్లి వర్ధని.

"ఏం జరిగింది వనజా?" అని అంది ఆశ్చర్యంగా సంధ్య.

''ఏం లేదు, పద భోజనం చేస్తూ మాట్లాడుకుందాం. నీతో ఓ ముఖ్యమైన విషయం చెప్పాలి'' అంటూ వంటిట్లోకి దారి తీసింది వనజ. ఏమవుతుందో అర్థంగాక, వనజని అనుసరించింది సంధ్య. భోజనం చేస్తూంటే మొదలెత్తింది వనజ.

''సంధ్యా, నువ్వు అమెరికాలో పెరిగేవు. నీకిదంతా చోద్యంగా తోచవచ్చు. కాని నే చెప్పేది జాగ్రత్తగా విని అర్థం చేసుకోడానికి ప్రయత్నించు. చూడు, కిరణ్ చాలా తెలివైనవాడు మంచివాడు. అతడు పైవాళ్లని ఇట్టే ఆకర్షించగల శక్తి కలవాడు. అతనితో రోజూ స్కూటర్ మీద వెళ్లడంలో తప్పేమీ లేదు. నీ మనస్సులో అతనిపై స్నేహభావం తప్ప వేరే ఉద్దేశ్యమేమీ లేదని నాకు తెలుసు. కాని కిరణ్ గురించి నీకు చెప్పాలి. కిరణ్ మేనమామ కూతురు ఉష. బియస్సీ చదువుతోంది. చాలా చక్కటి పిల్ల. ఉషని తన కోడలిగా చెసుకోవాలని కిరణ్ వాళ్లమ్మగారికి చిన్నప్పటినుండీ ఉంది. ఉషకి కిరణ్ అంటే చాలా ఇష్టం. కాని ఆ అమ్మాయి చాలా నెమ్మది. మనస్సులో ఉన్నమాట పైకి అనదు. నాకు చిన్నప్పటినుండి ఆ అమ్మాయిని బాగా తెలుసు కాబట్టి కిరణ్ అంటే ఆ అమ్మాయి అభిప్రాయమేమిటో నాకు తెలుసు. కాని, కిరణ్ ఏ సంగతీ వాళ్ల తల్లిదండ్రులతో చెప్పలేదు. ఇప్పుడిప్పుడే తనకి పెళ్లి ప్రసక్తి లేదని వాయిదా వేసుకుంటూ వచ్చాడు. కాని, ఉష అంటే తనకెలాంటి ఉద్దేశ్యం ఉన్నదీ ఎవరికీ చెప్పలేదు. మౌనం అర్థాంగీ కారం అనుకుంది ఉష. కిరణ్ అమెరికా వెళ్లే ప్రయత్నంలో ఉన్నాడన్న విషయం నీకు తెలుసు కదా! రెండు వారాల క్రితం అక్కడ ఏదో యూనివర్సిటీలో అడ్మిషన్ వచ్చిందట. నీకు తెలిసే ఉంటుంది. వెళ్లి పోవడానికి నిశ్చయించుకున్నాడు. దేశం వదలి వెళ్లి పోతున్నాడెలాగూ, పెళ్లి చేసి పంపిస్తే బాగుంటుందని, వాళ్లమ్మగారు, వాళ్లన్నయ్యకు కబురు చేశారు, ఉషని తీసుకు రమ్మని. ఫలితంగా ఉష, వాళ్ల నాన్నగారు, నిన్న మధ్యాహ్నం వచ్చారు మెయిల్లో. నిన్న రాత్రి కిరణ్‌ని పెళ్లిగురించి ప్రస్తావించేరట. తనకు ఇప్పుడే పెళ్లి చేసుకునే ఉద్దేశ్యంలేదని గట్టిగా చెప్పాడట. మరయితే ఎప్పుడు చేసుకుంటావని అడిగారట వాళ్లమ్మగారు. ఆ సంగతి ఇప్పుడే చెప్పలేనని అన్నాడట. అంత మొండిగా ఉన్నావెందుకు? అసలు ఉష అంటే ఇష్టంలేదా వేరే అమ్మాయిని ఎవరినైనా ప్రేమించావా, అని వాళ్లమ్మగారు వత్తిడి చేస్తే ఇంకా నీతో ఆ సంగతి మాట్లాడలేదని, కాని నువ్వంటే ఇష్టమని, నీకు అభ్యంతరం లేకపోతే నిన్ను పెళ్లి చేసుకుంటానని చెప్పాడట. దాంతో ఉషకి రాత్రి భోజనం, నిద్ర లేవు. ఉదయాన్నే నువ్వెళ్లగానే వచ్చి నా దగ్గర భోరుమని ఏడ్చింది. కిరణ్ వాళ్లమ్మగారు సరేసరి. నీమీద ఇంతెత్తున ఎగిరి మండిపడ్డారు. ఇంతకీ, కిరణ్ ఈ రోజు నీతో దాని సంగతి ఏమైనా మాట్లాడాడా?'' అంటూ ఆగింది వనజ.

''లేదే. అసలేమీ మాట్లాడలేదు. ఎందుకో చాలా మౌనంగా ఉన్నాడీ వేళ. ఓ మైగాడ్, నేనిదింతవరకు వస్తుందనుకోలేదు. బోయ్, వాట్‌షల్ ఐ డూ?'' అంటూ చేయి కడుక్కుని, బెడ్ మీద పడుక్కుని ఆలోచించ సాగింది సంధ్య. సడన్‌గా ఏదో నిర్ణయాని కొచ్చినట్లు వనజ గదిలోకెళ్లి,

''వనజా, నువ్వోపని చేస్తావా, ఇంకా ఉష ఇక్కడ ఎన్నాళ్లుంటుంది?'' అని అడిగింది సంధ్య.

''ఎల్లుండి వెళ్లిపోతారట. సాయంత్రం నీతో మాట్లాడిన తర్వాత తనతో మాట్లాడతానని చెప్పా. ఏం?''

''మరేం లేదు. నాకు ఆ అమ్మాయిని కలవాలని ఉంది. రేపు సాయంత్రం ఆరున్నరకి బిర్లామందిర్‌కి తనని తీసుకొస్తావా?'' అంది సంధ్య.

''ఏదో మాష్టర్ ప్లాన్ వేస్తున్నావేమిటి?'' అంది కుతూహలంగా వనజ.

''నీ మొహం, అదేమీ లేదుగాని, ఐ వాంట్ టు గివ్ హెర్ ఎ పీస్ ఆఫ్ మై మైండ్'' అంది సంధ్య.

''ఇదిగో, చూడు సంధ్యా, ఆ పిల్ల అసలుకే నెమ్మదైన పిల్ల. ఆ అమ్మాయిని అదరు గొట్టకేం. ఇంతకీ నీ ప్లాన్ ఏమిటో చెప్పూ'' బతి మాలింది వనజ. ''సర్ప్రైయిజ్'' అంటూ మూతిమీద వేలువేసుకొని తనగదిలోకి దారి తీసింది సంధ్య.

మర్నాడుదయం స్కూటర్ మీద కిరణ్‌తో వెడుతూంటే కిరణ్ అన్నాడు, ''సంధ్యా నీతో ఒక విషయం మాట్లాడాలి'' అని.

''నేనూ అదే అనుకుంటున్నా. ఈ రోజు సాయంత్రం ఆరున్నకి బిర్లామందిర్‌కి వస్తావా? అక్కడ మాట్లాడుకుందాం'' అంది సంధ్య. ఉత్సాహంతో, ఎంతో హుషారుగా తన అమెరికా ప్రయాణం, తన ఫ్యూచర్ ప్లాన్స్ గురించి చెప్పుకు పోయాడు కిరణ్.

* * *

ఆరోజు సాయంత్రం ఏదో పనుంది అంటూ నాలుగు గంటలకే ఇంటి దగ్గరనుండి బయలుదేరింది సంధ్య. వెళ్లే ముందు ఉషను తీసుకొని ఆరున్నరకల్లా బిర్లామందిర్‌కి రమ్మని వనజకు గుర్తు చేసి మరీ వెళ్లింది. అనుకున్న ప్రకారం అయితే, అదే సమయానికి కిరణ్‌కూడా అక్కడికి రావాలి. సంధ్య ఆరూపదిహేను కల్లా బిర్లామందిర్ చేరుకుంది. ఆదివారం సాయంత్రం అయినా, ఎండల వల్ల కాబోలు ఎక్కువ జనం లేరు. వచ్చే వాళ్లని ఎక్కడ మిస్ అవుతానేమోనని, ముఖద్వారం దగ్గరే ఒక చెట్టుక్రింద గట్టుమీద చతికిలబడి కూర్చుంది సంధ్య. ఆరున్నర అవకుండానే వచ్చారు ఉష, వనజ.

''ఉషా, ఇదిగో ఈ అమ్మాయే మాకజిన్ సంధ్య.'' అంటూ పరిచయం చేసింది వనజ. తెల్లగా, సన్నగా, నాజూగ్గా ఉంది ఉష.

''గ్లాడ్ టు మీట్ యూ '' అంటూ కరచాలనం చేసింది సంధ్య.

చిన్నగా నవ్వి కళ్లు క్రిందికి దించుకుంది ఉష. ఆ ముఖంలో ఏదో చెప్పలేని ఉదాసీనత కన్పించింది సంధ్యకి. ఈ పిల్లకి మాటలు వచ్చా అని అనిపించేంత ముభావంగా ఉంది ఉష.

''రా వనజా, ఇలా కూర్చో'' అంటూ తన ప్రక్క జాగా చేసింది సంధ్య. వాళ్లు కూర్చుంటూ ఉంటే తన స్కూటర్‌తో ఎదురయ్యాడు కిరణ్.

''హాయ్ సంధ్యా యామై లేట్ ....'' అంటున్న వాడల్లా ప్రక్కన వనజని, ఉషని చూసి తెల్లబోయాడు.

''మీరెప్పుడొచ్చారు?'' తీవ్రంగా ఉషవైపు చూస్తూ అన్నాడు.

''ఇప్పుడే'' అంది వనజ. ఉష ముఖం, కత్తి వాటుకి నెత్తురులేనంత పాలిపోయింది. తన ముఖం ఇంకా క్రిందికి దించేసుకోంది.

''అందరం మీదకి వెడదాం రండి.'' అంటూ దారి తీసింది సంధ్య.వెనకాలే మౌనంగా ఆమె ననుసరించారందరూ. దేవదర్శనం చేసుకొని ప్రక్కన ఉన్న ఒక వాకిలిలో నీడగా ఉన్నచోట చతికిల బడ్డారు నలుగురూ.

'కిరణ్, నీకు నేనో సంగతి చెప్పాలి. ఐ రియల్లీ లైక్ యూ ఎ లాట్. నువ్వంటే నాకు చాలా మంచి అభిప్రాయం ఉంది. నీ స్నేహాన్ని అనువుగా తీసుకొని ఇలా మాట్లాడుతున్నానని అనుకోవద్దు. ప్లీజ్ ఐ డోంట్ వాంట్ టు హర్ట్ యువర్ ఫీలింగ్స్. కాని చెప్పేది విను. ఉషా, యూ టూ.

నేను పెరిగిన వాతావరణం వేరు. చాలా స్వాతంత్ర్య భావాలతో మగా, ఆడా ఒకటే అనేటట్టుగా పెరిగా నేను. చిన్నప్పటినుండి

అమ్మాయిలూ, అబ్బాయిలూ కలిసి ఆడుకునే వాళ్లం. స్కూల్లో ఆడ, మగ భేదం లేకుండా ప్రక్క ప్రక్క డెస్కుల మీద కూర్చునే వాళ్లం. అంతే కాదు. ఒకళ్ల భుజాలమీద, ఇంకొకళ్లు చేతులు వేసుకుని తిరిగే వాళ్లం. అంతే కాదు, పదహేను, పదహారేళ్ల వయస్సులో డేట్ చెయ్యడం, బ్రేకప్ అవడం, ఇంకొకరితో డేటింగ్, ఇలాగ అమ్మాయిలకి, అబ్బాయిలకి మధ్య క్లోజ్ ఇంటరేక్షన్ ఎంతగానో ఉంటుంది. ఒక అబ్బాయి, అమ్మాయి పెళ్లి చేసుకుందాం, అని నిర్ణయానికొచ్చేముందు వాళ్లు ఒకళ్లతో ఇంకొకళ్లు ఏళ్లు గడిపి, వారి ఆలోచనలు, మనోభిప్రాయాలు, ఆశలూ, ఆశయాలూ అన్నీ సరిగ్గా కుదిరేయో, లేదో, భార్యా భర్తలుగా వారి మధ్య ఎలాంటి సమస్యలు రావచ్చు, ఇవన్ని జాగ్రత్తగా ఆలోచించుకొని మరీ ఆ నిర్ణయానికొస్తారు. అలా కాకుండా, కుదరదనుకుంటే విడిపోయి ఎవరి దారి వారు చూసుకుంటారు; అంతేగాని కుళ్లి కుళ్లి ఏడ్చి ఇక జీవితం వృధా అనుకోరు" అంటూ ఉషవైపు ఒక్కసారి చూసి మళ్లీ మొదలెట్టింది సంధ్య.

"మరి మీరు అలా కాదే! ఎవరైనా అమ్మాయి ఒక అబ్బాయితో చాలా క్లోజుగా మాట్లాడితే, తనంటే ఆ అమ్మాయికి ప్రేమ అని అపోహ పడతాడా అబ్బాయి. మొదటినుండి అబ్బాయిల్ని, అమ్మాయిల్ని విడదీసి ఉంచుతారేమో ఏ అబ్బాయి అయినా ఓ అమ్మాయిని రెండుమూడు సార్లు దీక్షగా పరీక్షించాడో, అంతే తనంటే ఇష్టపడు తున్నాడ నుకొంటుంది ఆ అమ్మాయి. ఫస్ట్ ఎన్కౌంటర్లోనే ఏవేవో ఊహించు కుంటారిక్కడ అమ్మాయిలూ, అబ్బాయిలూ. నిజానికి వారు ప్రేమ అనుక్కునేది నిజంగా ప్రేమ కాదు. ఆ వయస్సులో అందరికి సహజంగా కలిగే ఎట్రాక్షన్. దానినే ప్రేమ అనుకొని భ్రమ పడతారు.

అయామ్ సారి, మీకు లెక్చరివ్వాలని కాదు నా ఉద్దేశ్యం. కిరణ్, నిన్ను కేవలం ఒక మంచి స్నేహితుడిలా భావించా. అంతే! కాని వేరే ఉద్దేశ్యం ఏమీ లేదు. నిన్ను ఏవిధంగానైనా, ఎంకరేజ్ చేసి ఉంటే, నన్ను క్షమించు. ఇంకో విషయం కిరణ్, ఇది నాకు సంబంధించినది కాదు, కాని ఎందుకో చెప్పాలనిపించి చెప్తున్నా.

చిన్నప్పటినుంచి మీవాళ్లు ఉషనిచ్చి నీకు పెళ్లి చేద్దామనుకున్నప్పుడు, నీ కిష్టం లేకపోతే, ఆ సంగతి స్పష్టంగా వాళ్లకు ఎప్పుడో చెప్పి ఉండాల్సింది. అంతేగాని ఇలా ముసుగులో గుద్దులాట ఏం బాగుంది చెప్పు? ఉషా, నీ గురించి నాకు ఏమీ తెలియదు. కాని, నీకు కిరణ్ని చేసుకోవాలని ఉంటే, ఆ విషయం గురించి, తనతోనే డైరక్టుగా మాట్లాడవచ్చుగా. పోనీ, మొహమాటమా అనుకుంటే అతనేమన్నా నీకు పరాయివాడా? అతని మనసు తెలుసుకోకుండా ఆశాసౌధాలు కట్టడం, తెలివి తక్కువ తనం. అతడు నిన్ను పెళ్లి చేసుకోడు అని తెలియగానే ఆ సౌధం కూలిపోయినట్లు రాత్రి, పగలూ విచారించడం అంత ఇమోషనల్ ఇమ్మెచ్యూరిటీ ఇంకోటి లేదు." అంటూ ఆగింది సంధ్య.

"అయితే ఇది చెప్పడానికా, ఇంత ప్లాన్ వేసి, మమ్మల్ని ఇక్కడికి రప్పించింది. లెట్ మీ టెల్ యూ, ఐ డు నాట్ ఎప్రీషియేట్ ఆల్ దిస్" అంటూ లేచాడు కిరణ్.

"కిరణ్, ప్లీజ్ వెయిటె సెకండ్" అంటూ ఎదురుగా మెట్లెక్కుతున్న వ్యక్తిని చూసి నవ్వుతూ చెయ్యి ఊపింది సంధ్య. తెల్లటి పాలరంగు, నల్లటి ఉంగరాల జుత్తు, ఆరడుగుల పొడుగు, సెల్వార్ కమీజులో "హాయ్ సాంధ్యా" అంటూ వాళ్లని సమీపించాడా యువకుడు.

"హాయ్ సాల్, ఐ వాంట్యూ టు మీట్ మై ఫ్రెండ్స్, కిరణ్, వనజ అండ్ ఉష ... దీసీజ్ మై ఫ్రెండ్, మై ఫియాన్సే సాల్ పెర్ల్మన్" అంటూ పరిచయం చేసింది సంధ్య. అతను నవ్వుతూ అందరితో కరచాలనం చేసాడు.

"చూశారా ఏమీ సంకోచం లేకుండా అమ్మాయిలతో సహా కరచాలనం చేశాడు. అది మా సంస్కృతి. ఏనీవే, సాల్, నేనూ, గత ఎనిమిది సంవత్సరాలుగా స్నేహితులం. సాల్ మాఅన్న శ్రీకాంత్ క్లాస్మేట్స్, బెస్ట్ ఫ్రేండ్స్. ఇద్దరూ హైస్కూల్ బేండ్లో ఫ్లూట్ వాయిస్తూండే వారు. సాల్కి నాలాగే ఇండియన్ అన్నా, కర్ణాటక సంగీతం అన్నా చాలా ఇష్టం. అందుకే నేను ఇక్కడికి నాట్యం నేర్చుకుందామని వస్తే, తనూ మ్యూజిక్ నేర్చుకోడానికి వచ్చాడు. మేమిద్దరం కలిసే ఈ ఊరు వచ్చాం. తను అప్సర హొటల్లో ఉంటున్నాడు. వనజా, సాయంత్రాలు నేను ఓ ఫ్రెండుని కలియటానికి వెళ్తుంటానే, ఈయన్ని కలవటానికే. సాల్ జ్యూయిష్. మా అమ్మ నాన్న మా పెళ్లికి ఒప్పుకున్నారు. సాల్ పేరెంట్స్కి ఇది నచ్చలేదు. నవంబరు పన్నెండవ తేదీన మా వివాహం. తిరిగి అమెరికా వెళ్లి పోయేముందు అత్తయ్యకు, మామయ్యకు, అమ్మమ్మకు ఈయన్ని పరిచయం చేయాలి." అంటూ ఆపింది సంధ్య.

"షల్ వుయ్ హేవ్ సమ్ థింగ్ టు డ్రింక్" అన్నాడు సాల్.

"వనజా, నువ్వురా, కిరణ్, ఉషకి రైడిస్తాడులే" అంటూ సాల్ వెనకాల బయలుదేరింది సంధ్య.

"ఏమిటో ఇలా జరిగింది. ఉషా, నీతో నేనెప్పుడో చెప్పి ఉండాల్సింది మన పెళ్లిగురించి నేనెప్పుడూ ఆలోచించలేదని. అనవసరంగా ఇంత గొడవ జరిగి ఉండేది కాదు, కాని, ఉషా నువ్వుగాని సంధ్యతో చెప్పుకొని ఏడ్చావా ఏం?" అని అడిగాడు కిరణ్ ఉషని.

"ఐ ఫీల్ లైక్ ఫూల్ కిరణ్. అయామ్ రియల్లీ సారి. నిన్ను ఈ గొడవలో ఇరికించేను, ఏమీ అనుక్కోకు కిరణ్" అంది బాధపడుతూ ఉష.

"సర్లే పద.... నాకిక్కడ ఉండాలని లేదు. ఉషా, ప్రస్తుతానికి నేను నాపెళ్లి గురించి ఆలోచించ దలుచుకోలేదు. అమెరికా వెళ్లి, చదువు ముగించిన తర్వాతే నాపెళ్లి. నువ్వంటే నాకేమీ దురభిప్రాయం లేదు. కాని ఉషా, నాతో కాస్త ఫ్రీగా ఉండు, అలా బిగుసుకు పోయే వాళ్లతో నాకు ఎలా మాట్లాడాలో తెలీదు. నాకు ఒక ఏడాది గడువివ్వు. ఈ లోపల నాకు ఉత్తరాలు వ్రాస్తూ ఉండు. మనం పెళ్లి చేసుకున్నా చేసుకోకపోయినా మంచి స్నేహితులుగానైనా ఉండి పోవచ్చు. నేనే నిర్ణయాని కొచ్చినదీ నీకే వ్రాస్తాను. ఈ లోపల నువ్వు మనస్సు మార్చుకుంటే నిర్మొహమాటంగా నాకు చెప్పు. సరే, పద పోదాం" అంటూ లేచాడు కిరణ్. వెనకాలే వెళ్లింది ఉష.

* * *

రెండు రోజులు కిరణ్ కనబడక పోయేసరికి, ఆటోలో డాన్స్ స్కూలుకి వెళ్లింది సంధ్య. మూడోరోజు ఉదయం సంధ్య గేటు తీసుకొని బయటకు వెళ్తూ ఉంటే ఎదురయ్యాడు స్కూటర్తో కిరణ్.

"సారీ సంధ్యా. ఐ వజ్ టూ ఎంబరాస్డ్ టు ఫేస్ యూ; కాని నిన్ను తప్పించుకు తిరగడం పెద్దమనిషి తరహా కాదని నన్ను నేనే సమాధాన పరచుకున్నా. ఏయ్! కంగ్రాచ్యులేషన్స్. నీ ఎన్నిక చాలా బాగుంది. సాల్ నాకు చాలా నచ్చాడు." అంటూ స్కూటర్ స్టార్ట్ చేశాడు కిరణ్.

"థాంక్స్" అంటూ స్కూటరెక్కి కూర్చుంది సంధ్య.

* * *